క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్ ధరించిన ద్విచక్రవాహన చోదకులను అభినందిస్తున్న ఏఎస్ఐ భాస్కరరావు

తెర్లాం: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్ఐ భాస్కరరావు సూచించారు. ఎస్ఐ సాగర్‌బాబు ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ద్విచక్ర వాహన చోదకులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు. లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని అన్నారు.

బాలు పాట చిరస్మరణీయం



బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల వేస్తున్న సాయిప్రశాంత్‌కుమార్, తదితరులు

రాజాం సిటీ: సినీ నేపథ్య గాయకుడు, పద్మశ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాట ప్రేక్షకుల గుండెల్లో చిరస్మరణీయమని రెడ్ క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. బుధవారం బాల సుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా స్థానిక ఘంటసాల సంగీత కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సాయిప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఎంతో మంది గాయకులను తీర్చిదిద్దిన ఘనత బాలసుబ్రహ్మణ్యంకే దక్కుతుందని అన్నారు. ఘంటసాల సంగీత కళాశాల నిర్వాహకులు మంతపూడి ప్రసాద్, కళాకారులు ఏ.వెంకటినాయుడు, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, మాదా గంగాధర్, సీహెచ్.చంద్రశేఖర్, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

రాజాం: మండలంలోని గారారాజుచీపురుపల్లి గ్రామంలో అన్నపూర్ణసమేత కాశీ విశ్వేశ్వ రస్వామి ఆలయంతో పాటు నవగ్రహాల దేవాలయ ప్రతిష్ఠోత్సవాలు గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధ వారం తెలిపారు. వేద పండితులు జాడ సూర్యనారాయణశాస్త్రి, జాడ బాల చంద్ర మౌళీశ్వరశర్మ, జాడ నాగఫణిశర్మ, గ్రామ పురోహితుడు కర్రి వాసుదేవరావుశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిపించనున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు గురువారం ప్రతిష్ఠా సంకల్పం, వినాయకపూజ,రెండో రోజు శుక్రవారం హోమాలు, మూడో రోజు శనివారం ఉదయం 7.46 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

ఎండీఎం నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) నిర్వాహకుల సమస్యలను ప్రభు త్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎండీఎం నిర్వాహకులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఎండీఎం నిర్వాహకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం అందించాలని, మెస్ చార్జీలను పెంచాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని, వంట పాత్రలను ప్రభుత్వమే సమకూర్చాలని అన్నారు.

రుచి, శుచికరమైన భోజనం అందించాలి



తెర్లాం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ త్రినాథరావు

రేగిడి/ తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచి, శుచికరమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాకులకు రేగిడి, తెర్లాం ఎంపీడీఓలు జి.వి.ఆర్.ఎస్.పి.శ్యామలాకుమారి, రేగి రాంబాబు, ఎంఈఓలు ఎం.వి. ప్రసాదరావు, బి.ఎరకయ్య, త్రినాథరా వు, పాపారావు సూచించారు. రేగిడి ఎమ్మార్సీలో, తెర్లాం ఉన్నత పాఠశాలలో ఆయా మండలాల్లోని మధ్యాహ్న భోజన పథకం నిర్వా హకులతో గురువారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓలు, ఎంఈఓలు మాట్లాడుతూ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. రోజూ మెనూ ప్రకారం వంటలు చేయాలని, నాణ్యత, శుభ్రత పాటించాలన్నారు. వంట చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు.ఏ పాఠశాలలోనైనా వంటలు రుచికరంగా లేకపోయినా, మెనూ పాటించకపోయినా నిర్వాహకులను తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం నిర్వాహకుల సమస్యలను తెలుసుకున్నారు. తెర్లాంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఏర్పాటు చేసిన వంటల స్టాల్స్‌ను ఎంపీడీఓ, ఎంఈఓలు పరిశీలించారు.

నమ్మించి నట్టేట ముంచారు...

- కూటమి పాలనలో ప్రజలకు కష్టాలు, నష్టాలే..
- టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క హామీ అమలు కాని వైనం
- ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు
- ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డ మాజీ ఎమ్మెల్యే శంబంగి, నాయకులు
- దగా పాలనకు నిరసనగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'వెన్నుపోటు దినం' విజయవంతం



ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

బొబ్బిలి: టీడీపీ కూటమి పాలనలో ప్రజలకు కష్టాలు, నష్టాలు, అదనపు విద్యుత్ చార్జీలు, ఇంటి పన్నులే మిగిలాయి తప్ప సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల ఊసే లేదని బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో బొబ్బిలిలో శంబంగి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమం విజయవంతమైంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి కూటమి దగా పాలనను నిరసిస్తూ పట్టణంలో భారీ ర్యాలీ చేశారు.

వెన్నుపోటు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ నమ్మిన వాళ్లను నట్టేట ముంచి వెన్నుపోటు పొడవడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలతో పాటు వందలాది హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అండ్‌కో ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అన్నారు. తాను అధికారంలోకి వస్తే జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలను మరింత మెరుగుపరుస్తానని, అవి కాకుండా సూపర్ సిక్స్ పథకాలు కొత్తగా అమలు చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు ఇప్పుడు మొహం చాటేసి అమరావతి భూముల వ్యాపారం మళ్లీ మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తన అనుయాయులకు భూములు దోచిపెట్టేందుకే రాష్ట్ర రాజధానికి మరిన్ని భూములు అవసరమని చెబుతున్నారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగభృతి, తల్లికి వందనం, మహిళలకు నగదుబదిలీ, ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలను తుంగలో తొక్కారన్నారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లోనూ రైతులకు సాగుపెట్టుబడి సాయం రూపాయి కూడా అందించ లేదని, ఈ ఏడాది ఖరీఫ్ సమీపిస్తున్నప్పటికీ పెట్టుబడి సహాయం ఊసే లేదన్నారు.

ప్రజలకు మంచి చేసిన వ్యవస్థలను రద్దు చేస్తున్నారు..

తన పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు తెలుసుకున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వాటిని తొలగించేందుకు ఆలోచన చేసి సీఎం అయిన తర్వాత వలంటీర్, సచివాలయ, ఇంటింటికీ రేషన్ తదితర ఎన్నో వ్యవస్థలను రూపొందించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ వ్యవస్థల వల్లే ప్రజల గుండెల్లో జగన్ చోటు సంపాదించారన్న అక్కసుతో వాటిని రద్దు చేసేందుకు చంద్రబాబు కంకణం కట్టుకున్నారన్నారు. వలంటీర్లకు రూ.10వేల వేతనమిస్తానని ఎన్నికల సమయంలో నమ్మించి ఇప్పుడు వారిని పక్కన పెట్టేసి వ్యవస్థను పాడు చేశారన్నారు. అలాగే ఇంటింటికీ రేషన్ చేరవేసే ఎండీయూ వాహనాల వ్యవస్థను కూడా రద్దు చేశారన్నారు.

ఎండను సైతం లెక్క చేయని జనం

వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపును అందుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలే కాకుండా ప్రజలు కూడా భారీగా స్పందించారు. తీవ్రమైన ఎండ, ఉక్కపోతను సైతం లెక్క చేయకుండా ర్యాలీకి ప్రజలు భారీగా తరలివచ్చారు. దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర సాగిన నిరసన ర్యాలీలో పాల్గొని జగన్‌మోహన్‌రెడ్డి పాలన మళ్లీ కావాలంటూ నినదించారు. బొబ్బిలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఎస్‌బీఐ, కృష్ణా టాకీస్, ఎన్టీఆర్ బొమ్మ, తాండ్రపాపారాయుడి జంక్షన్, రెండు కోట్ల మధ్య నుంచి బొబ్బిలి బలిజిపేటరోడ్డులోని నీళ్ల ట్యాంకు మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీ చేరుకుంది. తహసీల్దార్ ఎం.శ్రీనుకు మెమొరాండం అందజేశారు.ర్యాలీలో అడుగడుగునా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, బొబ్బిలి పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఇంటి గోపాలరావు, ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి, జిల్లా ప్రచార కార్యదర్శి బొద్దల సత్యనారాయణ, రామభద్రపురం, తెర్లాం, బాడంగి ఎంపీపీలు చొక్కాపు లక్ష్మణరావు, నర్సుపల్లి ఉమా బాబ్జీరావు, బోగి గౌరీ సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ బి శ్రీనివాసరావు, రామభద్రపురం,తెర్లాం జెడ్పీటీసీలు అప్పికొండ సరస్వతి, గర్బాపు రామారావు, తెర్లాం, బొబ్బిలి, బాడంగి మండలాల పార్టీ అధ్యక్షులు తెంటు సత్యం నాయుడు, తమ్మిరెడ్డి దామోదరరావు, యామలి శివ ప్రసాదరావు,మునిస్పల్ కౌన్సిలర్లు,వార్డు ఇన్‌చార్జ్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తహసీల్దారుకు మెమొరాండం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాష్ట్రంలో అరాచక పాలన

రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని శంబంగి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పలు చోట్ల మహిళలు అత్యాచారానికి గురై పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి న్యాయం చేయాల్సిన పోలీసు వ్యవస్థ తిరిగి అటువంటి మహిళలపైనే కేసులు బనాయిస్తోందన్నారు. టీడీపీ పాలనలో ఎప్పుడూ తప్పు చేసిన వారికి శిక్షలు పడవన్నారు. తప్పులు చేసిన వారిని వెనకేసుకువచ్చి వారికి పదవులు అందిస్తారన్నారు. ప్రజలు, బాధి తులే సమిధలుగా మారేపరిస్థితి నెలకొందన్నారు.

ఒక్క హామీనైనా నెరవేర్చారా...?



రాజాంలో ర్యాలీలో పాల్గొన్న రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఏడాదైనా అమలు కాని సూపర్ సిక్స్‌పథకాలు
- వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్
- కూటమి ప్రభుత్వంపై గళమెత్తిన అసంతృప్తి
- రోడ్డెక్కిన వెన్నుపోటు నినాదం
- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



రాజాంలో మాట్లాడుతున్న రాజేష్, పక్కన సత్యనారాయణ, జగన్‌మోహనరావు

రాజాం: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని, ఎన్నికల హామీల్లో సీఎం చంద్రబాబునాయుడు ఒక్కటంటే ఒక్కటైనా నెరవేర్చారా అని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ప్రశ్నించారు. రాజాం నియోజకవర్గ కేంద్రంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమం విజయవంతమైంది.కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి 'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీలో స్పష్టంగా కనిపించింది. వేలాదిమంది బాధితులు రోడెక్కి 'పోయాం మోసం' అంటూ నినాదాలు చేశారు. పాలకొండ రోడ్డులోని సన్‌రైజ్ ఆస్పత్రి వద్ద ప్రారంభమైన ర్యాలీ శ్రీకాకుళం రోడ్డులో ఉన్న తహసీల్దార్ కార్యాల యం వరకు సాగింది. ప్రజా ప్రతినిధులు, నాయకులతో పాటు వేలాదిమంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. దారి పొడవునా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎగతాళిచేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

చంద్రబాబుకు పాలించే నైతిక హక్కు లేదని

తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజలను ఉద్దేశించి తలే రాజేష్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు రాష్ట్రాన్ని పాలించే నైతిక హక్కు లేదని అన్నారు. కూటమి తరఫున చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో పాటు అనేక బూటకపు హామీలు ఇచ్చారని, వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం, రైతు భరోసా, ఆసరా వంటి పథకాలు అటకెక్కాయని విమర్శించారు. వేలాదిమంది ఎండీయూ ఆపరేటర్లను రోడ్డున పడేశారని, రేషన్ సరుకుల కోసం ప్రజలు ఎండలో క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి తెచ్చారని దుయ్యబట్టారు. అమరావతి రాజధాని జపం తప్ప రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు ప్రస్తావన ఈ ప్రభుత్వానికి తోచడంలేదని, ఈ ప్రభుత్వాన్ని ఎంత వేగంగా గద్దె దింపుదామని ప్రజలు చూస్తున్నారని అన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పరిశీలకులు కిల్లి సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు మాట్లాడారు. తహసీల్దార్ ఎస్.కె.రాజుకు కలిసి మెమొరాండం అందజేశారు. కార్యక్రమంలోమాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, రేగిడి, వంగర మండలాల పార్టీ కన్వీనర్లు వావిలపల్లి జగన్‌మోహనరావు, కరణం సుదర్శనరావు, రాజాం జెడ్పీటీసీ బండి నర్సింహులు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, రాజాం, రేగిడి వైస్ ఎంపీపీలు నక్క వర్షిణి, యాలాల వెంకటేష్, టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ రాజాం నియోజకవర్గ కన్వీనర్లు పాలవలస గోపి, రాగోలు రమేష్‌నాయుడు, వంజరాపు విజయ్‌కుమార్, కనకల సన్యాసినాయుడు, వాకముల్ల చిన్నారావు, ఆసపు సూర్యం, వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మరిశర్ల గంగారావు మాస్టారు, నాయకులు డాక్టర్ నరేంద్ర, భవానీశంకర్, శ్రీరామమూర్తి, కామోదుల శ్రీరంగంనాయుడు, కోనారి అప్పారావు, కొర్ను ఈశ్వరరావు, నక్క శ్రీనివాసరావు, ఆల్తి రాంబాబు, గెడ్డాపు అప్పలనాయుడు, రాంబాబు, సామంతుల అరుణకుమారి, కోల్ల రమ్య, అల్లెన జయలక్ష్మి, డి. వెంకటరమణ, సవళాపురపు రమేష్ నాయుడు, పి.ఎస్.ఎన్.గుప్త, కెంబూరి నారాయణరావు, శాసపు వేణుగోపాలనాయుడు, పిట్టా జగదీష్, ఎం.సత్యారావు, ఎస్. జగదీష్, సింబాల రాము, కోరాడ రామినాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కోడూరులో తాగునీటి ఇక్కట్లు



బాడంగి మండలంలోని కోడూరులో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. మూడురోజులుగా వీధి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం ట్యాంకుకు పాల్తేరు గ్రామం వద్ద ఉన్న సీడబ్ల్యూడీఎస్ నుంచి నీరు నింపి, ఆ ట్యాంకు నుంచి వీధి కుళాయిలకు సరఫరా చేస్తుంటారు. ఏమైందో కానీ కుళాయిల ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో మహిళలు గ్రామ సమీపంలోని పొలాల వద్ద ఉన్న వ్యవసాయ బోర్లు, నూతుల నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని మహిళలు కోరుతున్నారు. – బాడంగి

ఇది రోడ్డే...!

చిత్రంలో కనిపిస్తుంది ఏ సాగునీటి పిల్ల కాలువో, చెరువు బట్టినో అనుకుంటే పొరపాటే. ఇది రేగిడి మండలం లోని సోమరాజుపేట గ్రామానికి వెళ్లే రోడ్డు.వన్నలి- గుళ్లసీతారాంపురం ప్రధాన రహదారికి అను సంధానం చేస్తూ సుమారు 5 కిలోమీటర్లు ఉన్న ఈరోడ్డులో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా పాడైంది. పెద్దపెద్ద గోతులతో ప్రమాదకరంగా తయారైంది. వర్షం కురిస్తే చాలు గుంతలో నీరు చేరి పోయి చెరువును తలపిస్తుంటోంది. గోతుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలు పాడవుతున్నాయని ప్రయాణి కులు, వాహన చోదకులు వాపోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ఆ గ్రామస్తులు, ఆ మార్గంలో ప్రయాణించే వారు కోరుతున్నారు. – రేగిడి



నాలుగు రోజులుగా అవే తిప్పలు...



ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు) వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకురాగా, ఆ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. గతంలో మాదిరిగానే ఈనెల ఒకటో తేదీ నుంచి రేషన్ డిపోల వద్దే సరుకులు పంపిణీ చేస్తున్నారు. దీంతో మళ్లీ ప్రజలకు రేషన్ కష్టాలు ప్రారంభమయ్యాయి. సరుకులు విడిపించుకునేందుకు తిప్పలు పడుతున్నారు. గంటలపాటు డిపోల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభించి నాలుగు రోజులు అవుతున్నప్పటికీ బాడంగి మండలంలో లబ్ధిదారులకు ఇంకా తిప్పలు తప్పడం లేదు. సర్వర్లు పని చేయకపోవడంతో సరుకుల పంపిణీ మందకొడిగా సాగుతోంది. కొన్ని గ్రామాల్లో రేషన్ డిపోలు లేకపోవడంతో పక్క గ్రామాల్లోని డిపోలకు వెళ్లాల్సి వస్తోంది. బ్రహ్మన్నవలస,గొల్లలపేట గ్రామాల లబ్ధిదారులు తమ గ్రామాలకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని కోడూరులోని రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు విడిపించుకుని తలపై మోసుకుంటూ ఎండలో వెళ్లాల్సివస్తోంది. అలాగే చినభీమవరం గ్రామస్తులు పెదభీమవరం కామన్నవలస గ్రామస్తులు గొల్లాది, రావివలస గ్రామస్తులు అల్లువానివలస వెళ్లాల్సి వస్తోంది. – బాడంగి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: రోజు రోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి సీఐ కె.నారాయణరావు సూచించా రు. మండలంలోని ఎస్.సీతారాంపురంలో యువకులు, విద్యార్థులు, పెద్దలకు మంగళవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, మరికొందరికి అవగాహన కల్పించాలన్నారు. చదువుకున్న వారు కూడా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు.కొరియర్ పేరుతోనూ మోసాలు జరుగుతున్నాయని, చైల్డ్‌పోర్నోగ్రఫీ,డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీ ట్రాప్,లాటరీల పేరుతోను, డెబిట్ కార్డు మోసాలు,ఇన్‌స్టాగామ్ మోసాలు, రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే రూ.10 కోట్లు ఇస్తామని,వీడియో కాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్‌మెయింగ్ తదితర నేరాలకు పాల్పడుతున్నారన్నారు.ఇటీవల రామభద్రపురం గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఫేక్ ఇన్‌స్టాగామ్ ద్వారా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడిన వ్యక్తిని అతి తక్కువ సమయంలోనే పోలీసులకు చిక్కాడన్నారు. నింది తుడిపై సైబర్, పోక్సో కేసు నమోదుచేశామని, ఇప్పుడు జైల్ జీవితం అనుభవిస్తున్నాడని తెలిపారు. మొబైల్స్‌కు వచ్చే లింక్‌లపై క్లిక్ చేయొద్దని, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రేగిడి: మండల కేంద్రంలో పాటు ఉణుకూరు, జోడుబందల, ఉంగరాడమెట్ట గ్రామాల్లోని ఎరువులు, విత్తన దుకాణాల్లో ఏఓ జి.మురళీకృష్ణ బుధవారం తనిఖీలు చేశారు. దుకాణాల్లో పురుగు మందులు, విత్తనాల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. కల్తీ పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

సంతకవిటిలో..

సంతకవిటి: నాణ్యమైన విత్తనాలు అమ్మకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ పైల నవీన్ ఎరువులు, విత్తన దుకాణాల నిర్వాహకులను హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు.విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే రైతులకు రసీదులు ఇవ్వాలని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోండి

బొబ్బిలి:రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొట్నూరు శంకర రావు ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రభుత్వం 41లక్షల విద్యుత్ స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధపడడం దారుణమని అన్నారు. ఈమీటర్ల వల్ల విద్యుత్ వినియోగదారులపై తీవ్ర భారాలు తప్పవన్నారు. పగలు ఒక ధర, రాత్రి వేళ ఒక ధర వసూలు చేసేందుకు నిర్ణయించారన్నారు. దీనికోసం అయ్యే ఖర్చు ఒక్కో వినియోగదారుని నుంచి రూ.10,550 వసూలు చేసేందుకు రంగం సిద్ధమైందన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యుత్ కార్యాలయాల వద్ద త్వరలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు



బైపాస్ రోడ్డులోని ఓ హోటల్‌లో వంటకాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ

రామభద్రపురం: మండల కేంద్రంలోని భోజన హోటళ్లు, దాబాల్లో ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటరమ ణ బుధవారం తనిఖీలు చేశారు. వంటకాలను, వంటగదులను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హోటళ్లు,దాబాల నిర్వాహకులకు ఆయన పలు సూచనలు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన భోజనాలు అందించాలని ,నాణ్యత లేని, వంటల్లో ఆరోగ్యానికి హాని చేసే రసాయనాలు కలిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏరోజు వండిన వంటల ను ఆ రోజే వినియోగదారులకు అందించాలని, నిల్వ చేసిన ఆహార పదార్థాలను వేడి చేసి మరుసటి రోజు పెడుతున్నట్లు ఫిర్యాదులు రాకూడదన్నారు. పలు హోటళ్లలో వంటకాల శాంపిల్స్ తీసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపిస్తున్నామని, నివేదికలు వచ్చాక నాణ్యతలో తేడా వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

సంతకవిటి: తమ కుటుంబంపై మరో కుటుంబీకులు దాడి చేశారని తాలాడ గ్రామానికి చెందిన రాగోలు ప్రశాంత్ అనే వ్యక్తి బుధవారం ఫిర్యాదు చేయడంతో ఏడుగురి వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. మంగళవారం రాత్రి తన అక్క, భావలు కుటుంబ విషయమై గొడవ పడుతుండడంతో అదే గ్రామానికి చెందిన మరో కుటుంబ సభ్యులు వారినే తిడుతున్నారనే అనుమానంతో తమ కుటుంబ సభ్యులపై దాడి చేశారని ప్రశాంత్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.